PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

మంగళవారం 31-03-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 207 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

# కేరళ అప్పు

## రూ.5లక్షల కోట్లు దాటింది - ప్రధాని మోదీ

జాతీయ స్థాయిలో కలిసి పనిచేసే ఈ రెండు కూటములు, రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తూ దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు.



- అప్పుల ఊబిలో కేరళ: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిందని, కేరళ అప్పులు రూ. 5 లక్షల కోట్లు దాటాయని ప్రధాని విమర్శించారు.
- జీతాల చెల్లింపు కష్టం: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకుందని ఆరోపించారు.
- మార్పు కోరుకుంటున్న ప్రజలు: కేరళలో ఈసారి మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, ప్రజలు ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములకు స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు.

కేరళ ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం ఉందని, మార్పు సందేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాలక్కడ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటముల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దశాబ్దాలుగా ఈ రెండు కూటములు రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపించారు. వీరి వాగ్దానాలను రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.పేజి 2లో ▶

# లక్ష్యం లేని యుద్ధమా..

## నెలరోజుల పోరులో ట్రంప్ సాధించిందేమిటి..?



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ప్రారంభమై నెల రోజులు గడిచింది. యుద్ధం ప్రారంభానికి ముందు ఇరాన్‌లో నాయకత్వ మార్పే లక్ష్యమన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. ఒకట్రెండు వారాల్లో ఈ ఆపరేషన్ ముగుస్తుందన్నట్లు సంకేతాలిచ్చారు. పోరు ప్రారంభమైన తర్వాత ఆయన తీరు మారింది. ఓసారి యుద్ధం ముగిస్తామని, మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడతామని.. ఇలా పొంతన లేని ప్రకటనలు ఆయన నోటి నుంచి వెలువడ్డాయి. వెలువడుతూనే ఉన్నాయి. యుద్ధానికి వెళుతున్నప్పుడు లక్ష్యం స్పష్టంగా ఉండాలి. నెల రోజుల యుద్ధ గమనాన్ని పరిశీలిస్తే,

పేజి 2లో ▶

## ఇంధన సంక్షోభం వేళ.. శ్రీలంకకు భారత్ సాయం



పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో భారత్ తన ఉదారతను చాటుకుంది. చమురు కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీలంక కు 38వేల మెట్రిక్ టన్నుల పెట్రోలియంను అత్యవసర సహాయం కింద ఆ దేశానికి సరఫరా చేసింది.పేజి 2లో ▶

# 'తల్లిదండ్రుల సంరక్షణ'

## బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం

నైతిక బాధ్యత: పిల్లల ఎదుగుదల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారని, అయితే రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల తీరు సమాజం తలదించుకునేలా ఉందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

2లో ▶



## బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీలు ఏమయ్యాయి?: భట్టి విక్రమార్క



2లో ▶

## బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు: సీఎం రేవంత్



హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానన్న హామీని కేసీఆర్ తుంగలో తొక్కారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అప్పట్లో సీనియర్లను కాదని..

2లో ▶

## సీఎం తమ్ముడు, బావమరిదిపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు సవాల్



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సవాల్ విసిరారు. "నా బావమరిది, తమ్ముడిపై సీఎం ఆరోపణలు చేశారు. సీఎం తమ్ముడు, బావమరిదిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నా బావమరిది, తమ్ముడిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధం. సీఎం తమ్ముడు, బావమరిదిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమా? హౌసింగ్ కమిటీ కాదు.. సీబీసీఐడీ కాదు.. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణకు నేను సిద్ధం.. సీఎం సిద్ధమా?పేజి 2లో ▶

## నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా?:



2లో..

# అమరావతికి చట్టబద్ధత..

## అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లును ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ, అప్పటి పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న తన చేతులమీదుగా రాజధానికి శంకుస్థాపన జరిగిన విషయాన్ని వెంకయ్య గుర్తుచేశారు.

పేజి 2లో ▶

## ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ




2లో..

# మూలపేట పోర్టుపై

## వైకాపావి పచ్చి అబద్ధాలు: అచ్చెన్నాయుడు




టెక్కలి: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం మూలపేటలో జరుగుతున్న పోర్టు నిర్మాణంపై వైకాపా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సోమవారం వైకాపా నేతలు పోర్టును సందర్శించనున్న నేపథ్యంలో ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోటబొమ్మాళిలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. మూలపేట పోర్టు పనులపై ప్రత్యేక వీడియోను విడుదల చేసి, కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. అప్పట్లో అన్నింటికీ అనుకూలమైన భావనపాడులో పోర్టు నిర్మాణం కోసం తాము అనుమతులు తీసుకొచ్చే సమయంలో ప్రభుత్వం మారిపోయిందని తెలిపారు.

పేజి 2లో ▶

# సంపాదకీయం

## ‘మతం’ చిక్కుల్లో జగన్!

పరాభవ నామ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అనుకూలంగా లేదని వైసీపీ నిర్వహించిన ఉగాది పంచాంగ పఠనం కార్యక్రమంలో సిద్ధాంతి చెప్పారు. సాధారణంగా రాజకీయ పార్టీలు నిర్వహించే పంచాంగ పఠనాల్లో పాల్గొనే సిద్ధాంతులు ఏ రోటి కాడ పాట ఆ రోటి కాడ పాడతారన్న అభిప్రాయం ఉంది. అంటే ఆయా పార్టీలను, వాటి అధినేతలను పొగుడుతూ పంచాంగ పఠనాలు సాగుతూ ఉంటాయి. ఇందుకు భిన్నంగా వైసీపీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధాంతి మాత్రం జగన్‌రెడ్డికి ఈ ఏడాది గ్రహబలం అనుకూలంగా లేదని చెప్పారు. సదరు సిద్ధాంతి చెప్పిన దాంట్లో నిజం ఎంత ఉందో తెలియదుకానీ, ఆయన చెప్పిన దానికి అనుగుణంగా రెండు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ రెండు పరిణామాలూ జగన్‌రెడ్డికి రాజకీయంగా అంతో ఇంతో నష్టం కలిగించేవే! మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌రెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఈ వివాదాల్లోంచి జగన్‌రెడ్డిని బయటపడేసేందుకు ఆయన మద్దతుదారులు తమ వంతు ప్రయత్నాలు మొదలెట్టారు. జగన్‌రెడ్డిలో మచ్చుకైనా కనిపించని గుణాలను ఆయనకు ఆపాదించే దుస్సాహసాలు చేస్తున్నారు. దాతృత్వంలోగానీ, కుటుంబ విలువలను పాటించడంలోగానీ వర్తమాన రాజకీయాలలో జగన్‌రెడ్డికి మరొకరు సాటిరారని ప్రచారం చేస్తున్నారు. దాతృత్వంలో కర్ణుడు కూడా జగన్‌తో సరితూగలేరని చాటిచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇంకా నయం, సకల గుణాభిరాముడు ఆ శ్రీరామచంద్రుడు కూడా జగన్ ముందు దిగదుడుపే అని చెప్పే ప్రయత్నం చేయలేదు. అయితే సిద్ధాంతి చెప్పినట్టుగా జగన్‌రెడ్డికి గ్రహస్థితి అనుకూలంగా లేదని భావించేలా ఆయన తల్లి విజయలక్ష్మి తాజాగా ఒక లేఖ విడుదల చేశారు. తాను సంతకం చేసిన సదరు లేఖ ఒరిజినల్ కాదని వైసీపీ వాళ్లు ప్రచారం చేసే అవకాశం ఉన్నందున ఆమె తన లేఖను నోటరీ చేయించారు. ఇదొక అరుదైన సంఘటన! విజయలక్ష్మి విడుదల చేసిన ఆ లేఖలో ఆస్తుల పంపకం గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2009లో రాజశేఖరరెడ్డి మరణించేవరకు తమకు ఉన్న ఆస్తులు అన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె ఆ లేఖలో స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం జరగలేదని, మొత్తం ఆస్తులను జగన్, షర్మిల పిల్లలు నలుగురికీ సమానంగా పంచాలన్నది రాజశేఖరరెడ్డి ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు. ఇది వైఎస్ ఆదేశమని కూడా ఆమె చెప్పుకొచ్చారు. ఇదే విషయాన్ని వైసీపీలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి కూడా చెబుతుండేవారు. ‘ఆస్తులన్నీ జగన్ పేరిట పెడితే ఎలా? షర్మిలకు అన్యాయం జరగకూడదు’ అని రాజశేఖరరెడ్డి తనతో అనేవారని ఆయన చెప్పారు. ‘ముందు ఇలాగే కానివ్వండి--అన్నీ సర్దుకున్నాక జగన్ నుంచి షర్మిలకు గిఫ్ట్‌గా ఆస్తులను బదిలీ చేయిస్తాను’ అని తాను రాజశేఖరరెడ్డికి నచ్చజెప్పానని కూడా విజయసాయిరెడ్డి చెప్పేవారు. అన్నా చెల్లెళ్ల మధ్య కుదిరిన ఎంవోయూ ప్రకారం అందులో పేర్కొన్న ఆస్తులన్నీ షర్మిలకు చెందాలని, నిజానికి ఎంవోయూలో షర్మిలకు పంచిన ఆస్తులు తక్కువేనని, బెంగళూరు సమీపంలోని యలహంకలోని భూమి కూడా షర్మిలకే చెందుతుందని విజయలక్ష్మి తేల్చి చెప్పారు.

ఆస్తుల పంపకం విషయంలో జగన్‌రెడ్డి ఇప్పటివరకు తన మేనల్లుడు, మేనకోడలికి అన్యాయం చేశాడని, ఎప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నానని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. ‘ఆస్తుల పంపకం జరగనే లేదు. షర్మిలకు ఇచ్చామని చెబుతున్న ఆస్తుల వంటివి జగన్‌రెడ్డి పేరిట కూడా ఉన్నాయి. ఇది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు’ అని ఆమె అన్నారు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరెవరు అని జగన్‌రెడ్డి మద్దతుదారులను ఆమె ప్రశ్నించారు. ‘మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం! అసత్యాల ప్రచారం మానుకోవాలని రాజశేఖరరెడ్డి భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను’ అని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కుటుంబ విలువలు, దాతృత్వంలో జగన్‌రెడ్డి తనకు తానే సాటి అయితే ఈ ఆస్తుల వివాదం ఎందుకు ఉత్పన్నం అవుతున్నది అన్న ప్రశ్నకు సమాధానం కావాలి కదా!

**అప్పుల నుంచి ఆస్తులదాకా...**

నిజానికి 2004లో రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి ఆ కుటుంబానికి ఇన్ని ఆస్తులు లేవు. “సండూరు పవర్ ప్రాజెక్టుకోసం 5 కోట్ల రూపాయలు కావాలని జగన్‌రెడ్డి అడుగుతున్నాడు-- ఎలా సర్దుబాటు చేయాలో తెలియడం లేదు” అని పార్లమెంటు సమావేశాల సందర్భంగా రాజశేఖరరెడ్డి తన వద్ద చెప్పుకున్నారని రాజంపేట ఎంపీగా ఉండిన సాయిప్రతాప్ ఒక సందర్భంలో చెప్పారు. ఈ సందర్భంగా ఇంకో విషయమూ చెప్పుకోవాలి. 2004లో ఎన్నికలు ముగిసిన తర్వాత రాజశేఖరరెడ్డి ఢిల్లీలో సోనియాగాంధీని కలిశారు. ఆ తర్వాత బొత్స సత్యనారాయణతో మాట్లాడుతూ, ‘ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేను ముఖ్యమంత్రిని కాలేకపోతే చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకోవలసి వస్తుంది’ అని రాజశేఖరరెడ్డి తన ఆవేదనను వెలిబుచ్చారు. అంటే ఇప్పుడు వివాదంలో ఉన్న ఆస్తులేవీ అప్పుడు లేవు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే ఆ కుటుంబానికి ఆస్తులు కొండల్లా పెరిగాయి. అవే ఆస్తులు ఇప్పుడు కుటుంబంలో చిచ్చు పెడుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి అవినీతి గురించి చెన్నయ్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో కాన్సులర్‌గా పనిచేసిన డేవిడ్ హోపర్ అమెరికా ప్రభుత్వానికి పంపిన ఈ మెయిల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అప్పట్లో సంచలనం సృష్టించిన వికీలీక్స్ వల్ల ఈ వ్యవహారం వెలుగుచూసింది. 2007 అక్టోబర్‌లో డేవిడ్ సదరు ఈ మెయిల్స్ పంపారు. నీటిపారుదల, గృహ నిర్మాణ రంగాలలో అవినీతి తారా స్థాయికి చేరిందని, ఈ అవినీతి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలన్న నిర్ణయాలను అమెరికా కంపెనీలు తీసుకోకపోవడం ఉత్తమమని డేవిడ్ స్పష్టం చేశారు. ‘భారతదేశంలో ప్రజలకు అవినీతి అలవాటైపోయింది. రాజకీయ నాయకుల అవినీతిని ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాల నుంచి తమకు ఉచితాలు అందితే చాలు అనుకొనే స్థితిలో ఉన్నారు. ఉచితాల కారణంగా రాజశేఖరరెడ్డి అవినీతిపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు.

రాజశేఖరరెడ్డి ఈ విషయాన్ని బలంగా నమ్మడం వల్లనే అవినీతికి హద్దూ అదుపూ లేకుండా పోతున్నది’ అని డేవిడ్ సెప్టెంబర్‌లో పంపిన మరో ఈ--మెయిల్‌లో పేర్కొన్నారు. ఈ విషయాలను తెలుసుకున్న అప్పటి అమెరికా అధ్యక్షుడు బుష్ నిర్ఘాంతపోయారని వికీలీక్స్ పేర్కొంది. రాజశేఖరరెడ్డి హయాంలో జరిగిన అవినీతితో తనకు ఏమి సంబంధం అని జగన్‌రెడ్డి సీబీఐ అధికారులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ప్రస్తావించడం గమనార్హం! దాదాపు ఇరవై ఏళ్ల క్రితం అమెరికా కాన్సులర్ తన లేఖలో పేర్కొన్నట్టు మన దేశంలో రాజకీయ నాయకుల అవినీతిని ప్రజలు పట్టించుకోవడం లేదు. పట్టించుకొనే పరిస్థితే ఉంటే అవినీతి మార్గాలలో అంతులేని సంపదను పోగేసుకున్న జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలరా? అయితే, ఎప్పటికైనా పాపం పండుతుంది అని అంటారు. ఇప్పుడు అవే అక్రమ ఆస్తుల కోసం కుటుంబ సభ్యులు వీధి పోరాటాలకు, న్యాయ పోరాటాలకు దిగారు.

**ఇవీ జగన్ విలువలు...**

ఇక్కడ రాజశేఖరరెడ్డి గురించి ఒక విషయం చెప్పుకోవాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఒక కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థికి ఫలానా మొత్తాన్ని సమకూర్చవలసిందిగా తన సహచరుడికి చెప్పారు. ఆ సహచరుడు అంత మొత్తమా? అని నోరు వెళ్లబెట్టగా, మనమేమైనా మట్టి పనులు చేసి సంపాదించామా? అని రాజశేఖరరెడ్డి అన్నారట! అంటే, అడ్డదారుల్లో పోగేసుకున్న సొమ్ము విషయంలో రాజశేఖరరెడ్డి ఉదారంగా ఉండేవారన్నమాట! ఈ ఉదారత చెల్లికి ఆస్తుల పంపకం విషయంలో జగన్‌రెడ్డిలో లోపించడమే వివాదానికి కారణం! అవినీతిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నది వాస్తవమే అయినా కుటుంబ విలువలు, దాతృత్వం విషయంలో జగన్‌రెడ్డి నైజాన్ని ప్రజలు ఆమోదించడం లేదు. అతనేమిటో తెలిసిపోవడం వల్లనే గత ఎన్నికల్లో పదకొండు సీట్లకే పరిమితం చేశారు. సంక్షేమ పథకాల మాటున అవినీతిని కప్పిపుచ్చుతున్నప్పటికీ కుటుంబంలో తలెత్తిన వివాదాలు మాత్రం జగన్‌రెడ్డికి రాజకీయంగా నష్టం చేశాయి. జగన్‌రెడ్డిలో ఉదార మనస్తత్వం ఉండి ఉంటే వేల కోట్ల సంపదను నేనొక్కడినే ఏం చేసుకుంటాను అని భావించి చెల్లికి పంచి ఇచ్చేవారు. ఇందుకు

## ‘తల్లిదండ్రుల సంరక్షణ’ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం

కేంద్ర చట్టం కంటే మెరుగ్గా: 2007 నాటి కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు నెలకు గరిష్ఠంగా రూ. 10 వేలు మాత్రమే ఇచ్చే వీలుందని, ఆ పరిమితిని అధిగమించి వృద్ధులకు మెరుగైన అండగా నిలవడమే ఈ కొత్త చట్టం లక్ష్యమని తెలిపారు.అందరికీ వర్తింపు: ఈ చట్టం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే కాదు, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీలు ఏమయ్యాయి?: భట్టి విక్రమార్క

హైదరాబాద్: శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తప్పుబట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో నిరసన కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా సంప్రదాయాలు తెలిసిన కేటీఆర్, హరీశ్‌రావు కూడా దారుణంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ అక్రమాలపై అడిగిన వెంటనే సీబీసీఐడీ విచారణకు ఆదేశించామన్నారు.

బీఆర్ఎస్ పాలనలో వేసిన మూడు హౌస్ కమిటీల నివేదికలు ఏమయ్యాయని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. గతంలో పలువురిని బ్లాక్‌మెయిల్ చేసి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారన్నారు. ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదని.. సభ హుందాతనాన్ని కాపాడాలని కోరారు. సభలో ప్రజాసమస్యలపై చర్చ జరగకూడదని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. గతంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని భూములు లాక్కున్నారని.. వందలాది ఎకరాలు కబ్జా చేసిన వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలన్నారు.

కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆగ్రహం

శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తీరుపై కాంగ్రెస్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి విషయంలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తించిన తీరును వారు తప్పుబట్టారు. కడియం శ్రీహరికి ఆయన క్షమాపణలు చెప్పాలని.. సభ నుంచి సస్పెండ్ చేయాలని మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు: సీఎం రేవంత్

దళిత నేత భట్టి విక్రమార్కను కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నేతను చేసిందన్నారు. దళిత నేత ప్రతిపక్ష నేతగా ఉండకూడదని బీఆర్ఎస్ కుట్ర చేసిందని.. ఎమ్మెల్యేలను లాక్కుని ఆ హోదా రాకుండా చేశారని రేవంత్ ఆరోపించారు. శాసనసభలో సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

“వ్యక్తిగతంగా భట్టి విక్రమార్కను బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు టార్గెట్ చేసి అవమానిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంతోమంది దళితులకు అవకాశాలు ఇచ్చింది. దళితుడి ముందు కేసీఆర్ చేతులు కట్టుకుని నిలబడాలని గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్పీకర్‌గా అవకాశం కల్పించాం. దళితుడు స్పీకర్‌గా ఉన్నారని శాసనసభకు కేసీఆర్ రావడం లేదు. దళిత మంత్రిని అవమానించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నించారు.

బంధువుల కంపెనీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని బెదిరించేందుకు ప్రయత్నిస్తున్నారు. గత 12 ఏళ్ల మైనింగ్ అక్రమాలపై సీబీసీఐడీ విచారణ చేపడుతుంది. అక్రమాలపై ఆధారాలు ఉంటే బీఆర్ఎస్ నేతలు సీఐడీకి ఇవ్వాలి. మైనింగ్ శాఖలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. హరీశ్‌రావు కారణంగా తాను ఇరుకున పడ్డానని కేటీఆర్ ఆగ్రహంగా ఉన్నారు. బీఆర్ఎస్ నేతల మంత్రాలకు చింతకాయలు రాలవు. ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క. రేవంత్ ముందు బీఆర్ఎస్ నేతల బెదిరింపులు నడవవు” అని రేవంత్ అన్నారు.

## కేరళ అప్పు రూ.5లక్షల కోట్లు దాటింది - ప్రధాని మోదీ

మొదటి పేజీ తరువాయి

“కేరళ దశాబ్దాలుగా స్వార్థ రాజకీయాల మధ్య చిక్కుకుపోయింది. మేం అధికారంలోకి వస్తే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం. అనేక కుంభకోణాలకు పాల్పడుతూ రెండు కూటములు అధికారాన్ని మార్చుకుంటున్నాయి. కానీ, ఒకరిపై ఒకరు ఏనాడూ చర్యలు తీసుకోలేదు. నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ రాష్ట్రాన్ని దోచుకున్నాయి. అంతేకాదు.. జాతీయ స్థాయిలో ఈ రెండు కూటములు పార్టీలు కలిసి పనిచేస్తాయి. రాష్ట్రంలో మాత్రం ప్రత్యర్థులుగా నటిస్తాయి” అని ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు.

**నారీశక్తికి నీళ్లొదిలిన కేరళ!**

“రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం నాశనం చేసింది. రాష్ట్రం అప్పు రూ.5లక్షల కోట్లు దాటింది. కొన్నేళ్లలోనే విపరీతంగా పెరిగింది. రాష్ట్ర ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్డీయే అధికారంలోకి వస్తే అవినీతిపరుల నుంచి డబ్బును రికవరీ చేసి రాష్ట్రాభివృద్ధికి ఖర్చు చేస్తాం” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇదిలాఉంటే, రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్, మే 4వ తేదీన కౌంటింగ్ జరగనుంది.

## లక్ష్యం లేని యుద్ధమా..

మొదటి పేజీ తరువాయి

ఓ లక్ష్యం లేకుండా ఈ యుద్ధంలోకి అగ్రరాజ్యం దిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.యుద్ధం ప్రారంభంలో మూడు లక్ష్యాలే తమకు ఉన్నాయని పెంటగాన్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తర్వాత పలువురు ఉన్నతాధికారులు తమకు నాలుగు యుద్ధ లక్ష్యాలు ఉన్నాయన్నారు. ట్రంప్ వీరందరి కంటే మరో అడుగు ముందుకు వేసి, అమెరికాకు ఐదు యుద్ధ లక్ష్యాలు ఉన్నాయని ఇటీవల ప్రకటించారు. ఇరాన్ క్షిపణి దాడుల సామర్థ్యాన్ని తగ్గించడం, ఆయుధ తయారీ యూనిట్లను ధ్వంసం చేయడం, నౌకా, వాయుసేనలను నిర్వీర్యం చేయడం, అణుకేంద్రాలను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాలోని మిత్రదేశాలకు రక్షణ కల్పించడం తమ లక్ష్యాలని ట్రంప్ తెలిపారు. మరి ఈ నెల రోజుల యుద్ధంలో ఎన్నింటిని అమెరికా సాధించిందో పరిశీలిద్దాం.

## తెదేపా.. తరతరాల తెలుగువారి ఆకాంక్షలకు ప్రతిరూపం

మొదటి పేజీ తరువాయి

పేదవారికి కూడు, గూడు, గుడ్డ ఇవ్వాలనే ఆయన సిద్ధాంతాన్ని సదా పాటిస్తున్నామన్నారు. తెదేపా కార్యకర్తల పార్టీ అని అన్నారు. ఆవిర్భావ దినోత్సవం అంటే మన ఇంటి పండుగ అని.. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్తకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం తెదేపా పుట్టిందని పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్లు అని నినదించిన ఎన్టీఆర్ స్ఫూర్తితో పేద ప్రజలకు అండగా నిలిచిందని తెలిపారు. తెదేపా ఆవిర్భావం తర్వాతే సమాజంలో అణగారిన, బడుగు, బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందని గుర్తుచేశారు. దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసిన పార్టీ తెదేపా అని పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగువారిని మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

## మూలపేట పోర్టుపై

### వైకాపావి పచ్చి అబద్ధాలు: అచ్చెన్నాయుడు

మొదటి పేజీ తరువాయి

అంత భూమి సేకరించి పరిహారం ఇవ్వలేక వైకాపా ప్రభుత్వం మూలపేట పోర్టుకు మార్పు చేసి, ఎన్నికలకు ఏడాది ముందు కొబ్బరికాయ కొట్టిందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చేసరికి కేవలం 22 శాతం పనులు మాత్రమే జరిగాయని, ఇప్పుడు 75శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు.పోర్టుకు రహదారి సౌకర్యం కల్పించలేని వైకాపా నేతలకు అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదని విమర్శించారు. ఉప్పు భూముల సేకరణ కోసం కనీసం దరఖాస్తు చేయలేకపోయారని అన్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎన్నో ప్రయత్నాలు చేసి.. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి 360 ఎకరాల ఉప్పుభూమిని 99 ఏళ్లకు లీజుకు తీసుకురావడంతో పనులు జరగడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఈ 22 నెలల్లో ఏం అభివృద్ధి జరిగిందో తెదేపా శ్రేణులు దీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి టెక్కలి నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు.

## ఏపీలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఏపీఈడీబీ సీఈవోగా షాన్‌మోహన్, ఏపీఐఐసీ ఎండీగా ఎ.ఎస్.దినేశ్‌కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్‌గా సాయికాంత్ వర్మ, విశాఖ కలెక్టర్‌గా అభిషిక్త్ కిశోర్, కాకినాడ జిల్లా కలెక్టర్‌గా ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, అల్లూరి జిల్లా కలెక్టర్‌గా టి.నిశాంతి, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా తమీమ్ అన్సారియాను ప్రభుత్వం నియమించింది.

## నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా?:

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వడం లేదని ఆక్షేపించారు. మంత్రుల నియోజకవర్గంలో మాత్రమే బిల్లులు వస్తున్నాయని, ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని వ్యాఖ్యానించారు. నిధుల కోసం మంత్రులు, సీఎం చుట్టూ తిరగాలా? అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, ప్రభుత్వం ఏం చేసినా.. ఖమ్మం జిల్లాకే వెళ్తున్నాయన్న టాక్ ఉందని అన్నారు. సీఎం తన సొంతనియోజకవర్గం కొడంగల్‌ను అభివృద్ధి చేసుకున్నట్లు.. మునుగోడులో చేసుకోవాలని ఉండదా? అని నిలదీశారు. మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకే లిఫ్టులన్నీ తరలిస్తున్నారని ఆరోపించారు. “ ప్రజలకు న్యాయం చేయకపోతే నేను ఈ పదవిలో ఉండటానికి అనర్హుడ్ని. రెండున్నరేళ్లుగా మనోవేదనతో రగిలిపోతున్నా. ఇప్పుడు అవకాశం వచ్చింది.. మాట్లాడుతున్నా. ప్రాంతాలు, నియోజకవర్గాలపై వివక్ష చూపొద్దు” అని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

## అమరావతికి చట్టబద్ధత..

### అమిత్‌షాతో మాట్లాడిన వెంకయ్య నాయుడు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం అందించిన సాయం గురించి ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. 2019 తర్వాత జరిగిన పరిణామాలు, ఎదురైన ఇబ్బందులను వివరించారు. భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటులో బిల్లు పెట్టి ఆమోదించాలని వెంకయ్య నాయుడు కోరారు. ఈ విషయంపై అమిత్ షా సానుకూలంగా స్పందించారు. తన మంత్రిత్వ శాఖ నుంచి అన్నీ క్లియర్ అయ్యాయని, క్యాబినెట్‌లో పెట్టి ఆమోదించడం ఒక్కటే మిగిలింది అని అమిత్ షా అన్నట్లు వెంకయ్య తెలిపారు.

## సీఎం తమ్ముడు, బావమరిదిపై విచారణకు సిద్ధమా?: హరీశ్‌రావు సవాల్

మొదటి పేజీ తరువాయి

పొంగులేటిని కాపాడేందుకు వంద అబద్ధాలు ఆడి రేవంత్‌రెడ్డి దొరికిపోయారు. ఏ పని కోసం నేనెప్పుడూ పొంగులేటికి ఫోన్ చేయలేదు. పొంగులేటి కంపెనీ అవినీతికి పాల్పడిందని అందరికీ అర్థమైంది. తప్పు జరిగిందని సీఎం, మంత్రి అసెంబ్లీలోనే ఒప్పుకొన్నారు. సీఎం, పొంగులేటి మధ్య లావాదేవీలు ఉంటాయి. వాళ్లు భూములను చెరిసగం పంచుకుంటారు. సభా సంఘం వేస్తే అన్నీ బయటకు వస్తాయని భయపడుతున్నారు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చి బేరం కుదిరితే తొలగిస్తున్నారు” అని హరీశ్‌రావు ఆరోపించారు.

## ఇంధన సంక్షోభం వేళ.. శ్రీలంకకు భారత్ సాయం

మొదటి పేజీ తరువాయి

కొలంబోలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని వెల్లడించింది. భారత ప్రధాని మోదీ, శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే ఇటీవల ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే భారత్ నుంచి ఆ దేశానికి సాయం అందింది. 20వేల మెట్రిక్ టన్నుల డీజిల్‌తో పాటు 18వేల మెట్రిక్ టన్నుల పెట్రోల్ తాజాగా కొలంబో నౌకాశ్రయానికి చేరుకున్నట్లు హైకమిషన్ పేర్కొంది. క్లిష్ట సమయంలో సాయం అందించినందుకు.. భారత్‌కు శ్రీలంక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు అక్కడి ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## ఎగ్జిట్ డోర్ తెరిచేందుకు ప్రయత్నించిన ఇండిగో ప్రయాణికుడు

ఇంటర్నెట్ డెస్క్: ఇండిగో విమానంలో ఓ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. విమానం గాల్లో ఉండగా ఓ ప్రయాణికుడి వింత చేష్టలు తోటి ప్రయాణికులను కలవరపాటుకు గురిచేశాయి. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను తెరిచేందుకు ప్రయత్నించడంతో ఆందోళన వాతావరణం నెలకొంది. దీంతో అతడిపై అధికారులు కేసు నమోదు చేశారు.

బెంగళూరు నుంచి వారణాసికి 6ఇ-185 ఇండిగో విమానం శనివారం బయలుదేరింది. టేకాఫ్ అయిన 15 నిమిషాలకే ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన మహమ్మద్ అద్నాన్ అనే ప్రయాణికుడు వింతగా ప్రవర్తించడం ప్రారంభించాడు. విమానం గాల్లో ఉండగానే ఎమర్జెన్సీ డోర్‌ను తెరిచేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన విమాన సిబ్బంది అతడిని మందలించారు. అయినప్పటికీ ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు మరోసారి తన చేష్టలతో గందరగోళం సృష్టించాడు. విమానం 500 అడుగుల ఎత్తులో ఉండగా ఎమర్జెన్సీ ఎగ్జిట్‌ను మళ్లీ తెరిచేందుకు ప్రయత్నించాడు. సిబ్బంది పైలట్‌కు సమాచారం అందించారు. భద్రత చర్యల్లో భాగంగా పైలట్ ల్యాండింగ్ నిలిపివేసి విమానాన్ని గాల్లోనే తిప్పారు. అనంతరం సురక్షితంగా వారణాసిలో ల్యాండ్ చేశారు. దీంతో ప్రయాణికులంతా ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత నిందితుడిని భద్రతా సిబ్బందికి అప్పగించారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. ఆ సమయంలో తాను ఎందుకు అలా చేశానో తెలీదని, దెయ్యం ఆవహించిందంటూ నిందితుడు చెప్పడం గమనార్హం.

# ఏపీలో ముగిసిన మావోయిస్టుల కథ!

- ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో ఉనికి కోల్పోయిన పార్టీ
- మిగిలిన ఒకే ఒక్కడు చెల్లూరి నారాయణరావు
- నేడు దళంతో సహా డీజీపీ ముందు లొంగుబాటు

మేకార్తి దినపత్రిక, మార్చ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

మావోయిస్టు రహిత భారత్ కోసం కేంద్రం ప్రారంభించిన 'ఆపరేషన్ కగార్' లక్ష్యాన్ని ఏపీ చేరుకుంది. మావోయిస్టు కేంద్ర కమిటీలో ఏపీ నుంచి మిగిలిన ఒకే ఒక్కడు చెల్లూరి నారాయణరావు కూడా లొంగిపోయేందుకు రంగం సిద్ధమైంది. మావోయిస్టు పార్టీ కీలక నాయకుల్లో చాలావరకూ ఇప్పటికే తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోవడంతో శ్రీకాకుళం జిల్లాకు చెందిన నారాయణరావు ఏపీ పోలీసులకు టచ్‌లోకి వచ్చారు. సంప్రదింపుల అనంతరం సోమవారం తన దళంతో సహా డీజీపీ ముందు లొంగిపోనున్నారు. దీంతో 1980 నుంచి మావోయిస్టు పార్టీకి పెద్ద దిక్కులా వ్యవహరించిన ఏపీ నాయకత్వం ఇక చరిత్ర పుటల్లోకి చేరబోతోంది.



**నక్సలైట్ల నుంచి మావోయిస్టుల వరకూ...**

నక్సల్ బరిలో పుట్టిన విప్లవ పార్టీలో సభ్యుల్ని నక్సలైట్లుగా పిలిచేవారు. ఆ తర్వాత పీపుల్స్ వార్ గ్రూపుగా కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో దేశంలోని పలు రాష్ట్రాలకు విస్తరించింది. ఉమ్మడి ఏపీ లో బలంగా ఉన్న మావోయిస్టులను అణచి వేసేందుకు గ్రేహౌండ్స్ ద ళాన్ని ఏర్పాటుచేసిన రాష్ట్ర పోలీసు శాఖ దేశంలోని పలు రాష్ట్రాల పోలీసులకు శిక్షణ సహకారం అందించింది. రాష్ట్ర విభజన తర్వాత గతేడాది నవంబరు మూడో వారంలో హిడ్మా ఎన్‌కౌంటర్‌తో సత్తా చాటింది. రాష్ట్రంలో ఒకప్పుడు మంత్రులు, ఐపీఎస్ అధికారుల్ని సైతం కాల్చి చంపిన మావోయిస్టులు తుపాకీ రాజ్యం స్థాపిస్తామని ప్రభుత్వాలకు సవాలు విసిరారు. తమ ఉనికి కోసం ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తూ ప్రజా ప్రతినిధులపై దాడులు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలు విసిచారు. 2003లో సీఎం చంద్రంబాబుపై అలిపిరి వద్ద దాడి చేసిన మావోయిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలకు పిలిచింది. తమ పార్టీకి అదే పెద్ద శాపమని మావోయిస్టులు గతంలో పేర్కొన్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల నుంచి దండకారణ్యంలో మావోస్టుల వరకూ అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రణాళికా బద్ధంగా శ్రమించింది. ఈ నెల 31లోపు దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పలుమార్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా ఆ పార్టీని చావుదెబ్బ తీశారు. ఈ క్రమంలో కేంద్రం విధించిన గడువు నాటికి ఏపీలో మావోయిస్టు నాయకత్వం తుడిచిపెట్టుకు పోయిందని ఏపీ పోలీసులు ప్రకటించనున్నారు.

# ఏప్రిల్ 1న అయ్యప్ప స్వామి మహాపడిపూజ

- అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్త.

మేకార్తి దినపత్రిక మార్చి 30 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



అయ్యప్ప స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 1న చేర్యాల అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్త తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవ కార్యక్రమానికి భక్తమహాశయులు సతీ సమేతముగా పెద్ద ఎత్తున రావాలని పేర్కొన్నారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకలతో ప్రత్యేక పూజలు నిర్వహించబడతాయని అన్నారు. అనంతరం మహా పడిపూజ కార్యక్రమం ఉంటుందని అన్నారు. పడిపూజ కార్యక్రమం అనంతరం తీర్థ ప్రసాదలతో పాటు మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

# మార్కెట్ షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

- హాజరైన సర్పంచ్ మల్లు గారి పద్మ...

మేకార్తి దినపత్రిక మార్చి 30 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో సోమవారం రోజుమార్కెట్ షెడ్డు నిర్మాణానికిభూమి పూజ నిర్వహించారు, ఈ నిర్మాణానికి గాను గ్రామీణ ఉపాధి హామీ ద్వారా 10 లక్షలు, గ్రామపంచాయతీ నుండి 5 లక్షల రూపాయలను, మొత్తం 15 లక్షల రూపాయలతో మార్కెట్ యార్డ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు, సర్పంచ్ మల్లు గారి పద్మ మాట్లాడుతూ, వర్షాలకు తడుస్తూ ఎండకు ఎండుతూ, నిత్యం కూరగాయలు అమ్మే వారి కొరకు ఈ షెడ్డు చాలా ఉపయోగపడుతుందని, మరింత మెరుగుపడుట కొరకుమార్కెట్ యార్డ్ నిర్మాణం చేపట్టామని తెలిపారు, దీనికి సహకరించిన రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్, ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి , లకు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఏపీఓ అరుణ. పంచాయతీ కార్యదర్శి వినీల్ రెడ్డి ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి వార్డు సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అమిద్ మరియు కాంగ్రెస్ కార్యకర్తలుప్రజలు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహ ప్రవేశంలో పాల్గొన్న దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి .

మేకార్తి దినపత్రిక మార్చి 30సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి . ఆదేశాల మేరకు, ఈరోజు దుబ్బాక మండలం హబ్సిపూర్ గ్రామంలో 2వ వార్డు చెందిన అబ్బుల సత్యవ్వ లింగయ్య నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనీ ప్రారంభించిన దుబ్బాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి . ఈ సందర్భంగా కొంగరి రవి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా పాలనలో భాగంగా నిరుపేదలైనటువంటి ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లును ఇచ్చే విధంగా ప్రాణాలిక సత్యం చేసి ప్రతి ఒక్క నిరుపేద కుటుంబాలలో ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం మరి వెలుగుల నింపుతుందని హర్షం వ్యక్తం చేశారు, ఒక్కసారి మాట ఇస్తే ఖచ్చితంగా మాట నిలబెట్టుకొని తీరుతామని ఎవరు ఎలాంటి అపోహాలకు పోకుండా నిత్యం కాంగ్రెస్ పార్టీ వెంటే నడవాలని అక్కడున్నటువంటి ఇందిరమ్మ లబ్ధిదారులకు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు సూచించారు ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇల్లులను మంజూరు చేసి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వారి కుటుంబాల్లో వెలుగు నింపుతుంది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు జోగు పోచయ్య, సర్పంచ్ బలెముల శ్రీలత రాంచంద్ర రెడ్డి,



మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ అజీజ్, మల్లి కనకరాజు, దుర్గేష్, కొత్త మహిపాల్ పాల్ రెడ్డి, రంగ రెడ్డి, అదేవిధంగా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కార్యకర్తలు ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి టోకెన్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం.

మేకార్తి దినపత్రికమార్చి 30 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.



సిద్దిపేట జిల్లా తొగుట మండలకేంద్రలోని వ్యవసాయ మార్కెట్ లో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు, మక్కజొన్న ధాన్యాలు స్వీకరణ నేటి నుండి టోకెన్ ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం చేసిన ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్య పడకండి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుంది అన్నారు ఎవరో వచ్చి రాజకీయ ఉనికి కోసం రెచ్చగొడితే రెచ్చిపోకండి నాడు నేడు రైతులకోసం పని చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, కోపరేటివ్ స్పెషల్ ఆఫీసర్ రవి, మార్కెట్ కమిటీ సెక్రటరీ స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షులు భారత్ తేజ, మాజీ వైస్ చైర్మన్ పోచయ్య, గంగారెడ్డి, సీనియర్ నాయకులు పబ్బతి మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి ముక్కెర కనకయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం.

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

మేకార్తి దినపత్రిక మార్చ్ 30 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈరోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ప్రజావాణికి 205 దరఖాస్తుల రాక

- స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు

మేకార్తి దినపత్రిక,మార్చి 30 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ప్రజావాణిలో అర్జీలు కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వీకరించి.. పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 205 అర్జీలు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేశారు. రెవెన్యూ శాఖకు 82, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓకు 30, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన అధికారికి -8, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి ఐదు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా సంక్షేమ అధికారి 4, జిల్లా పౌర సరఫరాల శాఖ, జిల్లా వైద్యాధికారి, నీటి పారుదల శాఖ అధికారికి మూడు చొప్పున, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, సెస్ ఎండీకి రెండు చొప్పున, చేనేత అండ్ జౌళి శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, బీసీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారి, అటవీ



శాఖాధికారి, మైనింగ్ అధికారి, జిల్లా ఎక్సైజు అధికారి, యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి, ఈడీఎం, జీజీహెచ్ సిరిసిల్ల, సబ్ రిజిస్టార్ సిరిసిల్ల, మెప్మా కార్యాలయానికి ఒకటి చొప్పున రాగా.. వాటిని సంబంధిత కార్యాలయాలకు పంపించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలను నిరోధించే అల్లారం తాళం

- ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై గణేష్

మేకార్తి దినపత్రిక, మార్చి 30 ముస్తాబాద్



ముస్తాబాద్ గ్రామాలలో మీ ఇంట్లో, గ్రామం లో ఉన్న ఆలయాల్లో దొంగలు పడకుండా నిరోధించేందుకు యాంటీ థెఫ్ట్ అలారం తాళాలు వేయాలని ముస్తాబాద్ ఎస్ ఐ గణేష్ సూచించారు. సోమవారం ముస్తాబాద్ మండలం తెర్లు మద్ది గ్రామం లో గ్రామ సర్పంచ్ బైతి దుర్గమ్మ -నవీన్ గ్రామం లో ఉన్న 8 ఇతర, కుల. సంఘాల దేవాలయాలకు సర్పంచ్ స్వంత నిధుల తో ఒక్కొకటి రూ. 800రూపాయల విలువ గల స్మార్ట్ యాంటీ థెఫ్ట్ అలారం తాళాల ఏర్పాటు చేయడం తో వాటిని ఎస్ ఐ ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎస్ ఐ మాట్లాడుతూ గ్రామాలలో ఇంటి తలుపులు, ఆలయలకు, కిటికీలకు స్మార్ట్ యాంటీ థెఫ్ట్ అలారం తాళం వేస్తే చాలు దొంగలు వాటిని తెరిచేందుకు యత్నిస్తే మాగ్నటిక్ సెన్సార్ల సహాయంతో అలారం మోగుతుందని, దొంగలు ఈ తాళాన్ని పగుల గొట్టేందుకు యత్నిస్తే 105 నుంచి 110 డెసిబుల్ శబ్దాలతో అలారం మోగిస్తూ నివాసితులతోపాటు చుట్టుపక్కల గృహాల వారిని అప్రమత్తం చేస్తుంది. అని తెలిపారు ఈ అధునాతన తాళాల సహాయంతో దొంగతనాలను నియంత్రించవచ్చని తెలిపారు. ఆస్తి నేరాలు జరగకుండా అందరూ అలారం తాళం ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ ఐ తో పాటు గ్రామ సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ.

మేకార్తి దినపత్రిక మార్చి 30 సిద్ధిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల మండల కేంద్రం లో ఉన్న 108 అంబులెన్స్ ను సిద్ధిపేట జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సంపత్ ఆకస్మిక తనిఖీ చేసి వాహనంలో ఉన్న అన్ని పరికరాల పనితీరును చూసి అందులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది శ్రీకాంత్ మరియు శిరీష , అర్జున్ మరియు రమేష్ ల పనితీరు పై సంతోషం వ్యక్తపరిచారు. ఇలాంటి ఏమార్జెన్సీ సర్వీస్ నీ చేర్యాల మండల ప్రజలకి ఎల్లపుడు అందుబాటులో ఉండాలని సూచించారు.



# చేర్యాల మున్సిపల్ సాధారణ సమావేశం.




మేకార్తి దినపత్రిక మార్చి 30 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల మున్సిపల్ చైర్పర్సన్ యం.అరుణ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించడం జరిగినది. ఇట్టి సమావేశంలో చేర్యాల పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని మరియు చేర్యాల నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేయనైనది,

అదేవిధంగా వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీటి సమస్య తలెత్తకుండా మరియు వీధి దీపాలు ఇబ్బంది లేకుండా 12 వార్డులకు సంబంధించి వార్డుకు లక్ష రూపాయలు చొప్పున 12 లక్షలు కేటాయించడం జరిగినది, దోమల నివారణ మరియు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయుటకు మొత్తము ( 5 ) తీర్మానాలు కౌన్సిల్ పాలక వర్గం ఆమోదించనైనది ఈ సమావేశంలో వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,మున్సిపల్ కమిషనర్, విద్యుత్ అధికారులు మరియు కార్యాలయ అన్ని శాఖల అధికారులు పాల్గొనడం జరిగినది.

# తెలంగాణలో దంచి కొడుతున్న ఎండలు 40 డిగ్రీల ఉష్ణోగ్రత

**– భగ్గుమంటున్న భానుడు ముందే ఎండలు.**



మెకార్తి దినపత్రిక మార్చి 30 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.

ఏప్రిల్ 29 నుండి మే 12 వరకు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు (ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు) వెళ్లకూడదు. ఎందుకంటే ఉష్ణోగ్రత 45లీజ నుండి 55లీజ వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఎవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా అస్వస్థత కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. గాలి సరిగా వచ్చేలా గదుల తలుపులు తెరిచి ఉంచండి. మొబైల్ వినియోగాన్ని తగ్గించండి, అధిక వేడి కారణంగా మొబైల్ పేలే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి మరియు ఈ సమాచారాన్ని ఇతరులకు తెలియజేయండి. పెరుగు, మజ్జిగ, బేల్ పండు రసం వంటి చల్లని పానీయాలను ఎక్కువగా తీసుకోండి.

చాలా ముఖ్యమైన సమాచారం: పౌర రక్షణ విభాగం ప్రజలు మరియు నివాసితులకు క్రింది సూచనలు చేస్తోంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47లీజ నుండి 55లీజ వరకు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే వేడి గాలులు ఉండే అవకాశం ఉంది. కాబట్టి ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి: కార్లలో ఉంచకూడని వస్తువులు: గ్యాస్ పదార్థాలు లైటర్లు కార్బోనేటెడ్ పానీయాలు సుగంధ ద్రవ్యాలు మరియు బ్యాటరీలు గాలి ప్రసరణ కోసం కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచండి కారు ఇంధన ట్యాంక్‌ను పూర్తిగా నింపకండి సాయంత్రం సమయంలోనే ఇంధనం నింపండి ఉదయం కారులో ప్రయాణం చేయడం నివారించండి ప్రయాణ సమయంలో టైర్లలో అధిక గాలి నింపకండి ఇతర జాగ్రత్తలు:తేళ్లు మరియు పాములు చల్లని ప్రదేశాల కోసం ఇళ్లలోకి రావచ్చు, కాబట్టి జాగ్రత్తగా ఉండండి ఎక్కువగా నీరు మరియు ద్రవాలు తాగండి గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచవద్దు విద్యుత్ మీటర్లపై అధిక లోడ్ వేయవద్దు అవసరమైన గదుల్లో మాత్రమే ఎయిర్ కండిషనర్ ఉపయోగించండి

ప్రతి 2-3 గంటలకు కనీసం 30 నిమిషాలు విశ్రాంతి తీసుకోండి బయట ఉష్ణోగ్రత 45 47లీజ ఉన్నప్పుడు, ఇంట్లో ాజని 24-25లీజ వద్ద ఉంచండి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నేరుగా సూర్యకాంతిని తప్పించండి చివరిగా:ఈ సమాచారాన్ని తప్పనిసరిగా ఇతరులతో పంచుకోండి. చాలా మందికి ఇది తెలియకపోవచ్చు. లిమీరు మొదటిసారి చదువుతున్నవారిలో ఒకరై ఉండవచ్చు.

# విద్యార్థులు రోడ్డు భద్రతపై నిబంధనలు అవగాహన సదస్సు

**– కోనరావుపేట ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి**



మేకార్తి దినపత్రిక, మార్చి, 30 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

కోనరావుపెట మండలంలోని ధర్మారం ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో సోమవారం 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పై కే. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ఈ విషయాన్ని విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# శిల్ప కళాకారులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

**– 100 కోట్ల రూపాయలతో రామప్ప దేవాలయాని అభివృద్ధి చేయాలి.**

**– బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి..**

మే కార్తి దినపత్రిక హైదరాబాద్:

శిల్పాలను శిల్ప తోరణాలను అద్భుతంగా తొలసి అనేక దేవాలయాలు ప్రతిష్టకు శిల్ప కళాకారులు నిలిచారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి కొనియాడారు. అలాంటి శిల్పకారుల పరిస్థితి దయనీయంగా మారుతుందని కేంద్ర ప్రభుత్వాలు స్పందించి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్ రామప్ప దేవాలయాన్ని గణేష్ చారి తన బృందంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కళా నైపుణ్యాన్ని కళాకారుల కృషిని వివరిస్తూ ఇలాంటి శిల్ప కళలు ఎక్కడ చూడలేదన్నారు. తాజ్మహల్, అయోధ్య, తిరుమల తిరుపతి, వారణాసి ఇలా అనేక దేవాలయాలు కళాకారులతో ఏర్పాటు చేసిన కళా అద్భుతమని రాబోయే తరాలకు ఇది గొప్ప కానుకగా నిలుస్తుందని తెలిపారు. రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రాష్ట్ర



ప్రభుత్వం వెంటనే 100 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండ రాములు, శ్రీహర్ష, ప్రభావతి, స్రవంతి, విజయలక్ష్మి, కౌశల్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

# 54వ ఉమెన్స్ సీనియర్స్ హ్యాండ్ బాల్ నేషనల్ ఛాంపియన్షిప్ పాల్గొన్న ఆకునూరు గ్రామ విద్యార్థిని

మేకార్తి దినపత్రిక మార్చి 30 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

ఈనెల 30వ తేదీ నుండి ఏప్రిల్ మూడో తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బరేలీనగరంలో 54 వ సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా నుండి మాద రజిత అనే సీనియర్ క్రీడాకారిణి పాల్గొన్నది ఈమె సిద్దిపేట్ జిల్లాలోని చేర్యాల మండల ఆకునూరు గ్రామానికి చెందినది . ఈమె పాఠశాల స్థాయి నుండి అనేక రాష్ట్రస్థాయి హ్యాండ్





బాల్ పోటీలలో పాల్గొని ఉత్తరప్రదేశ్లో జరుగుతున్న సీనియర్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొననుంది.ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్షుడు మేరుగు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు అదేవిధంగా ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి మాట్లాడుతూ మా గ్రామంలో నుండి అనేకమంది జాతీయస్థాయి క్రీడాకారులు ఎదిగారని మరియు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించి స్థిరపడ్డ వారితోపాటు ప్రస్తుత ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేసినారు. ఈ సమావేశంలో ఆకునూర్ గ్రామ ఉపసర్పంచ్ కదారి పల్లవి భాస్కర్ ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ సెక్రెటరీ మొహమ్మద్ రఫత్ ఉమర్ తెలియజేశారు.

# గృహ సముదాయాల బ్లాక్‌లు గుర్తించి సీఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

**– డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి**

**– హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

మేకార్తి దినపత్రిక మార్చి 30: రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి



జనగణన-2027కు సంబంధించి గృహ సముదాయాల బ్లాక్‌లు (హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లు) గుర్తించి సీ ఎం ఎస్ ఎస్ (సెన్సస్ మేనేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్) పోర్టల్‌లో నమోదు చేయాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతీ హోలికేరి మాట్లాడుతూ.. మే 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జనగణన-2027 కోసం అన్ని జిల్లాల్లో 10 శాతం అధికంగా ఎన్యుమేటర్లు,సూపర్వైజర్లను గుర్తించి నియమించాలని ఆదేశించారు. నియమితులైన సిబ్బంది వివరాలను సీఎంఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు.జనాభా ఆధారంగా రెవెన్యూ గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లను ముందుగా రూపొందించి, వాటి ప్రకారం హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇళ్ల వివరాలను సేకరించి హౌజ్ లిస్టింగ్ చేయాలని, పోర్టల్ ద్వారా ఈ ప్రక్రియపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి హౌజ్ లిస్టింగ్ బ్లాక్‌లో 700 నుంచి 850 వరకు జనాభా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హౌజ్ లిస్టింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు సమావేశంలో సీపీఓ శ్రీనివాసాచారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్యార్థులకు కంప్యూటర్ పైన సర్టిఫికెట్ కోర్సు

మేకార్తి దినపత్రిక మార్చు 30 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్ విద్యార్థులకు మరియు నాన్ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పకుండా ఎమ్మెస్ వర్డ్.ఎమ్మెస్ ఎక్సెల్. పవర్ పాయింట్,పి




పి టి. వంటి వాటిని పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు ఏ రంగంలో రాణించాలన్న కంప్యూటర్ పరిజ్ఞానం తప్పకుండా ఉండాలని అన్నారు.కంప్యూటర్ అధ్యాపకులు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ టెక్నాలజీ రంగంలో కంప్యూటర్ యొక్క ఆవశ్యకత చాలా ఉందని తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం ప్రభాకర్,డాక్టర్ వై ఆంజనేయులు డాక్టర్ జె శ్రవణ్ కుమార్, పాక ధర్మపురి, వి వాణి, డాక్టర్ ఆది విష్ణు,డాక్టర్ కేవీ బిక్షమయ్య, మనోహర్, శ్రీనివాస్, సుచరణ్, రవీందర్, శంకర్, దీపిక, భార్గవి, రమ్య తదితరులు పాల్గొన్నారు

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**– చేసిన సర్పంచ్ యాదమ్మ-శ్రీనివాస్**

మేకార్తి దినపత్రిక, మార్చ్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులు అయిన లిచేపూరి సందీప్ 51000/- తౌటి ఎల్లయ్య 24000/ నాంపల్లి కల్పన 24000/ దేశెట్టి వెంకట రాములు 22000/జంగా లక్ష్మీనారాయణ వార్డు మెంబర్ 32500 రూపాయలు,మొత్తం 153500 రూపాయల చెక్కులను ఈ రోజు లబ్ధిదారులకు అందచేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ-శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు అన్నమేని రాజు మరియు కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పెద్దిగారి శ్రీనివాస్, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ ఓరగంటి తిరుపతి ఎన్ ఆర్ ఐ , సి ఈ ఎల్ ఎల్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, మరియు మెరుగు కిరణ్, మామిండ్ల ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కేసుగాని చంద్రమౌళి, ఆది శేఖర్, రాయమల్లు, హరిబాబు, మరియు గ్రామ కుల ప్రముఖులు పాల్గొన్నారు.

# శ్రీ భాషిత పాఠశాలలో నూతనంగా నెలకొల్పిన అత్యాధునిక గ్రంథాలయం (లైబ్రరీ), సైన్స్ ప్రయోగశాల (ల్యాబ్) లను సందర్శించిన జిల్లా సైన్స్ అధికారి

మేకార్తి దినపత్రిక,
శ్రీ భాషిత పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన అధునాతన సైన్స్ ప్రయోగశాల మరియు గ్రంథాలయాన్ని (లైబ్రరీ) జిల్లా సైన్స్ అధికారి, కస్తూరి గంగా కిషన్ సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా జిల్లా సైన్స్ అధికారి పాఠశాలలో ఏర్పాటు చేసిన తదుపరి సైన్స్ ల్యాబ్ ను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక పరికరాలను ఆసక్తిగా వీక్షించారు. భౌతిక శాస్త్రం, రసాయనిక శాస్త్రం మరియు జీవ శాస్త్రానికి సంబంధించిన ఎన్నో సైన్స్ పరికరాలను నిశితంగా పరిశీలించారు. తదుపరి అక్కడే నూతనంగా ప్రారంభించబడిన ఆధునిక గ్రంథాలయాన్ని కూడా పరిశీలించారు. అలాగే పాఠశాలలో నెలకొల్పిన గ్రంథాలయం. ప్రైమరీ విద్యార్థుల నుండి పై తరగతుల విద్యార్థుల వరకు అందరికీ ఉపయోగపడే విధంగా పాఠ్యపుస్తకాలతో పాటు కథలు, సైన్స్,జనరల్ నాలెడ్జ్, మనోవికాస మరియు నైతిక విలువలపై పుస్తకాలు సమృద్ధిగా ఉండడం ఆయనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ "విద్యార్థులలో పరిశోధనభావం మరియు శాస్త్రీయ ఆలోచన పెంపొందించడానికి ఇలాంటి అత్యాధునిక సదుపాయాలు అత్యంత ముఖ్యమైనవి. వీటిని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీ భాషిత పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి చేస్తున్న ఇట్టి ప్రయత్నాలతో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోందని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్



మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నాణ్యమైన విద్యతోపాటు అనుభవాత్మక విద్యను అందించడం మ ప్రధాన లక్ష్యం. అందుకోసం లైబ్రరీ మరియు సైన్స్ ల్యాబ్ లను ఏర్పాటు చేశాము అని, వీటితో పాటు గత 6 సంవత్సరాలుగాఅటల్ టింకరింగ్ ల్యాబ్ (రోబోటిక్స్ ల్యాబ్) చాలా అద్భుతంగా విద్యార్థులకు ఉపయోగిస్తున్నామని తెలిపారు. అలాగే, మా పాఠశాల విద్యార్థులకే కాకుండా ఇతర పాఠశాలల విద్యార్థులకు కూడా లైబ్రరీ మరియు సైన్స్ ల్యాబ్ లు ఉపయోగించుకోడానికి సౌకర్యం కల్పిస్తామని అలాగే నిరుద్యోగ యువతకు కూడా లైబ్రరీ సౌకర్యం ఉచితంగా కల్పిస్తామని శ్రీ భాషిత కరస్పాండెంట్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి, గంగాకిషన్ తో పాటు సుద్దపల్లి పాఠశాల సీనియర్ స్కూల్ అసిస్టెంట్ గోవర్ధన్ పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్స్ , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎస్సీ హోదా రద్దు చేయడం కాదు, కుల వ్యవస్థను రద్దు చేయండి.




మేకార్తి దినపత్రిక మార్చి 30
సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

ఎస్సీల మత స్వేచ్ఛను హరించే 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం మరియు వివక్షతకు ప్రతిరూపం. కుల వివక్షతను రూపుమాపడం చేతకానప్పుడు కుల వ్యవస్థను రద్దు చేయండి. ఓసి,బిసి క్రైస్తవులకు లేని నిబంధనలు ఎస్సీలకు మాత్రమే ఎందుకు ? క్రైస్తవాన్ని ప్రచారం చేసే మత ప్రచారకులంతా అగ్రకులాలే.

సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 మరియు 25 కు పూర్తి విరుద్ధం. హిందూ దేవాలయాలలోకి రావద్దు,ఇంకో మతంలోకి వెళ్ళద్దు అని దళితులకు ఆంక్షలు పెట్టడం దుర్మార్గం. ఏమి తినాలో, ఎలా ఉండాలో ,ఎక్కడికి వెళ్ళాలో, ఏ విశ్వాసాలు పాటించాలో మీరే నిర్ణయిస్తారా ? దళితులు గొర్రెలు అనుకుంటున్నారా ? ఇకపై చెల్లవు. గాంధీ మరియు గాంధీ అనుచరుల కుట్రల వల్ల దళిత క్రైస్తవులు హక్కులు కోల్పోయారు. గాంధీ కుట్రల వల్ల దళితులు కమ్యునల్ అవార్డును మరియు మత స్వేచ్ఛ హక్కులను కోల్పోయారు. రాజ్యాంగ సమయంలో క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహించింది అగ్రకులాలే. అందువల్లనే దళిత క్రైస్తవుల హక్కులపై వాళ్ళు మాట్లాడ లేదు. క్రైస్తవంలోకి వెళితే బ్రాహ్మణుల , రెడ్డిల , కమ్మల, వెలమ కులస్తుల సామాజిక హోదా మారనప్పుడు దళితుల ఎస్సీ హోదా ఎందుకు మారుతుంది.? క్రైస్తవంలోకి మారిన అగ్రకులాలు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందుతున్నప్పుడు క్రైస్తవంలోకి మారిన దళితులు ఎస్సీ రిజర్వేషన్లు ఎందుకు పొందకూడదు? క్రైస్తవంలోకి వెళ్ళినంత మాత్రాన దళితుల సామాజిక స్థితిగతులు మారవని డా . అంబేద్కర్ 1937లోనే స్పష్టం చేశారు. దళిత క్రైస్తవులు ఆత్మగౌరవానికి ,సామాజిక హక్కులకు దూరం అయ్యారని అంబేద్కర్ ఆవేదన చెందాడు. కుల వ్యవస్థ అన్ని మతాలను ప్రభావితం చేస్తుంది. కుల వ్యవస్థ వల్ల దళితులు పశువుల కన్నా హీనంగా చూడబడ్డారు. కుల వ్యవస్థ వల్లనే హిందూ మతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించలేకపోయింది. క్రైస్తవం , ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతుంటే హిందూ మతం ఎందుకు ప్రభావం చుపెట్టలేకపోతుందో ఆలోచించి లోపాలు సరి చేసుకోవాలి. అఖండ భారత్ నుండి ప్రస్తుత భారత్ మిగిలింది, కుల వ్యవస్థ ఇలాగే కొనసాగితే ప్రస్తుత భారత్ కూడా మిగలదేమో అని ఆందోళనగా ఉంది. అందుకే కుల వ్యవస్థను రద్దు చేయాలి.

హిందూ దేవాలయాలు అందరివి అయినప్పుడు బ్రాహ్మణులు మాత్రమే పూజారులుగా ఎందుకు ఉండాలి.? హిందూ దేవాలయాలలో పూజలు బ్రాహ్మణులు మాత్రమే చేయాలని రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వర స్వామి చెప్పారా ?అయోధ్య మొదలుకొని అన్ని దేవాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను పూజారులుగా నియమించాలి . రాముడికి , శ్రీ కృష్ణుడికి తోడుగా యుద్ధంలో నిలిచింది దళితులు, గిరిజనులు మరియు బీసీలే కానీ బ్రాహ్మణులు కాదు. అందువల్ల ఎస్సీ, ఎస్టీ , బీసీలె దేవాలయాల్లో పూజారులుగా ఉండాలి.

1956 లో సిక్కు దళిత క్రైస్తవులకు , 1990 లో బౌద్ధ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించినట్లుగానే దేశ వ్యాప్తంగా దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా ఇవ్వాలి. దళిత క్రైస్తవులు అంబేద్కర్ , నెల్సన్ మండేలా, మార్టిన్ లూతర్ కింగ్ ను స్ఫూర్తిగా తీసుకొని పోరాటం చేయాలి. ప్రార్థనలు మాత్రమే కాదు పోరాటం కూడా దళిత క్రైస్తవులు చేయాలి. దళిత క్రైస్తవులు పోరాటం చేస్తే ఎమ్మార్పీఎస్ వారికి అండగా ఉంటుంది .

# ఏప్రిల్ 6 వ తేదీ లోపు అప్లై చేసుకోండి జర్నలిస్టులకు అక్రెడిటేషన్ గడువు

మేకార్తి దినపత్రిక,
తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డుల కోసం ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్ ప్రియాంక సూచించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు వివరాలు వెల్లడించారు. జర్నలిస్టులు తమ యాజమాన్యాల నుంచి పొందిన సిఫార్సు లేఖతో పాటు అవసరమైన పేపర్ కటింగులు విద్యార్హతల సర్టిఫికెట్లు ఇండిపెండెంట్ జర్నలిస్టులు కటింగ్లతో పాటు సంబంధిత ఎడిటర్ పత్రికకు



వార్తలు రాసినట్లు ధ్రువీకరించే లేఖ సంబంధిత అర్హత పత్రాలను జత చేయడంతో పాటు తాము వేరే ఇతర వృత్తులలో అనగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్ ప్రభుత్వ ఉద్యోగం, న్యాయవాద వృత్తి, సర్పంచ్ తదితర ఇతరత్రా ఏ పద పదవుల్లో కొనసాగడం లేదని సెల్ఫ్ డిక్లరేషన్ జతచేసి హార్డ్ కాపీని సంబంధిత డిపిఆర్ఓ కార్యాలయాలలో అందజేయాలని, అప్లికేషన్ను పూర్తి చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారికే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై సంబంధిత అధికారులకు కఠిన చర్యలకై ఆదేశాలు ఇవ్వనున్నట్లు స్పెషల్ కమిషనర్ వెల్లడించారు ఇప్పటికే రాష్ట్ర అక్రెడిటేషన్ కమిటీ రెండు సార్లు సమావేశమై జీఓ అమలు, విధి విధానాలపై చర్చించిందని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను సమీక్షిస్తూ, అర్హత ప్రమాణాలు పూర్తి చేసిన జర్నలిస్టులకు కార్డులు జారీ చేసే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు...

## కొత్తగూడ గంగారాం మండలాల్లో 6 ఏళ్ల సేవల అనంతరం 108 సిబ్బందికి ఘన వీడ్కోలు

**కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన 108 సిబ్బందికిద ఘన గౌరవాభివందనం**

మేకార్తి దినపత్రిక,
కొత్తగూడ మరియు గంగారాం మండలాల్లో గత ఆరేళ్లుగా ప్రజలకు అండగా నిలిచి అత్యవసర సేవలను అందించిన 108 అంబులెన్స్ సిబ్బందికి తోటి సహోద్యోగులు



ఘనంగా వీడ్కోలు పలికారు. అత్యవసర పరిస్థితుల్లో అనేక ప్రాణాలను రక్షిస్తూ, ప్రమాదాల్లో గాయపడిన వారిని సమయానికి సరైన ఆసుపత్రులకు తరలిస్తూ సేవాభావంతో పనిచేసిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషన్లు పాలడుగుల రవి,దస్రు,అలాగే పైలట్లు సంపత్ రెడ్డి,సందీప్ లు బదిలీపై వరంగల్ జిల్లాకు వెళ్లడం నేపథ్యంగా ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వీడ్కోలు సభలో తోటి సిబ్బంది తమ మధుర జ్ఞాపకాలను పంచుకుంటూ,వీరు ప్రజలకు అందించిన సేవలను హృదయపూర్వకంగా కొనియాడారు. ప్రాణాలను రక్షించడం తమ ధర్మంగా భావించి, ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిర్విరామంగా పనిచేసిన వీరి సేవలు స్థానిక ప్రజల మదిలో మరపురాని జ్ఞాపకాలుగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో పైలట్లు వెంకటేశ్వర్లు,ఫాక్రుద్దీన్,గోవర్ధన్, గణేష్,నగేష్,అలాగే ఇఎంటి లైన మహేందర్,రాంబాబు,తొగరు బుచ్చిరెడ్డి,కవిత పాల్గొని,వరంగల్ జిల్లా బాధ్యతల్లో వారికి మరింత విజయాలు కలగాలని శుభాకాంక్షలు తెలిపారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు

**కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచన**

మేకార్తి దినపత్రిక,
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలంలోని జూపల్లి గ్రామంలో ఈనెల 30వ తేదీన జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని



వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు కోరారు. అచ్చంపేట నియోజకవర్గం ఉప్పునుంతల మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలకు వ్యవసాయ కార్మికులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం దొరికే వరకు పోరాటం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మహాసభలకు వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య నర్సింగ్ హోమ్ ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

- హాజరైన మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం
- సర్పంచ్ మల్లు గారి పద్మ

మేకార్తి దినపత్రిక మార్చి 30 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఆదిత్య హాస్పిటల్ ప్రారంభించారు. సర్పంచ్ మల్లు గారి పద్మ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఆదిత్య హాస్పిటల్ యజమాన్యం



ఏర్పాటు చేయడం శుభ సూచకమని ఈ మండల ప్రాంతంలో ఎంబీబీఎస్ వైద్యులు లేక కామారెడ్డి సిద్దిపేట సిరిసిల్ల హైదరాబాద్ దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారని దాన్ని దృష్టిలో ఉంచుకొని ఇక్కడ మండల ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో ల్యాబ్ టెస్టులు ఎంబిబిఎస్ వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని ఇట్టి అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకొని మంచి వైద్యం చేయించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మ కాంగ్రెస్ మండల అధ్యక్షులు హమీద్. ఉపసర్పంచ్ కమలాకర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పుట్టపర్తి నుండి బయలుదేరి జోగిపేటకు చేరిన దివ్య అఖండ ప్రేమ జ్యోతి

మేకార్తి దినపత్రిక,
ఆందోల్ నియోజకవర్గంలో ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీలో చారిత్రక జోగిపేట పట్టణంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అఖండ ప్రేమ జ్యోతి
స్వామి వారి దివ్య సన్నిధి ప్రశాంతి నిలయం పుట్టపర్తి నుండి బయలుదేరిన దివ్య అఖండ ప్రేమ జ్యోతి తెలంగాణ రాష్ట్రమంతటా పర్యటించి సంగారెడ్డి జిల్లాలో ప్రవేశించడం జరిగింది. పటాన్చెరు నుండి నేడు ఆదివారం 29-03-2026 ఉదయము 9 గంటల 30 నిమిషాలకు జోగిపేటలో మధ్యరంగం నుండి పూర్ణకుంభం, వేద పఠణముతో మందిరానికి చేరుకోవడం జరిగింది తదనంతరం భజన తదుపరి నూతన జ్యోతి ప్రకాశ అనంతరం మంగళ హారతి మరియు దివ్య దర్శనం భక్తులకు కల్పిస్తారు ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి బాబా కమిటీ సభ్యులు భక్తులు పిల్లలు పెద్దలు కాలనీవాసులు పాల్గొనడం జరిగింది



# ఘనంగా దమ్మపేట మండలంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

మేకార్తి దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మార్చి 29 తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దమ్మపేట మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దమ్మపేట మండల కేంద్రంలో దివంగత నాయుడు చెన్నారావు ,ఇంటి వద్ద తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం తెలుగుదేశం పార్టీ అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల టిడిపి అధ్యక్షులు ఎండి వలీపాషా,సీనియర్ టీడీపీ నాయకులు.నాయుడు వీరస్వామి,బంధం శ్రీనివాసరావు, చిర్రా ధర్మారావు,భోగి సత్యం, వార్డు సభ్యులు ఉయ్యాల లక్ష్మీనారాయణ,సజ్జా అనంత, సయ్యద్ బాజీ, మల్లికార్జున రావు,



ప్రసాదు, షేక్ మౌలాలి, నాయుడు సుబ్బారావు, కృష్ణ, చక్కరపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.గండుగులపల్లిలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం వట్టి రమేష్, వెంపాటి చెన్నారావు, దొడ్డ వెంకటేశ్వరరావు, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.మొద్దులగూడెం నాయుడుపేటరింగులో టిడిపి ఆవిర్భావ దినోత్సవంలిటీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.నాచారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో మట్ట స్టాలిన్, దొండపాటి సుమన్, మాదాల శ్రీనివాసరావు, దొడ్డ రాజా, దొడ్డ విజయ్, పర్వతనేని సత్యనారాయణ, నారం సుబ్బారావు, సిద్దిన శ్రీనివాసరావు, రాజాబాబు, దొడ్డ చిన్నబ్బాయి,రాయల సూరిబాబు, చారి, వసంతరావు,చరమళ్ళ శ్రీను,రాయల పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు 25 ప్రత్యేక బస్సులు, ప్లాస్టిక్ నిషేధం

**– మహాలక్ష్మి పథకం ఈ ప్రత్యేక బస్సుల్లో వర్తిస్తుందని తెలిపిన ఆర్టీసీ**

మేకార్తి దినపత్రిక



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం సలేశ్వరం జాతర సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఏప్రిల్ 1 నుంచి 3 తేదీ వరకు జాతర జరుగుతుందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగర్ కర్నూల్ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఈ ప్రత్యేక బస్సుల్లో కూడా వర్తిస్తుందని పురుషులు మాత్రం ప్రభుత్వం నిర్ణయించిన చార్జీలను చెల్లించాలని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు అడవిలో ప్లాస్టిక్ వస్తువులు, మంట వస్తువులు, అధిక శబ్దాలు చేస్తూ అడవి జంతువులకు ఇబ్బంది కలిగించొద్దని అటవీశాఖ అధికారులు సూచించారు. జాతర జరిగే మూడు రోజుల్లో సాయంత్రం 6 గంటల వరకు తిరిగి రావాలని కోరారు. మద్యం తాగడం లాంటి అసాంఘిక కార్యక్రమాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో.... డైరెక్టర్ జనరల్ టీజీ ఎస్ పి ఎఫ్, స్వాతి లక్రా ఐపీఎస్ ఆదేశానుసారం....

మేకార్తి దినపత్రిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: పాల్వంచ తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక-2026..... దీనిలో భాగంగా టీజీఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ మరియు అసిస్టెంట్ కమాండెంట్ వారి ఆధ్వర్యంలో పాల్వంచ శ్రీనివాస నగర్ కాలనీ ప్రైమరీ స్కూల్ నందు వి కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా సుమారుగా 150 మంది కుంటి నాగుల గూడెం మరియు శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన పేద ప్రజలు వైద్య సహాయాన్ని పొందారు. టీజీ ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ పి కోటేశ్వరావు మాట్లాడుతూ డైరెక్టర్ జనరల్ టీజీ ఎస్ పి ఎఫ్, స్వాతి లక్రా ఐపీఎస్ ఆదేశానుసారం ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టాము... ఈ వైద్య శిబిరం ద్వారా కొంతమంది పేదవాళ్ళకి వైద్య సహాయం చేయడం ఆనందంగా ఉంది మరియు దీనికి సహకరించిన డిప్యూటీ మేయర్



కొత్తగూడెం మరియు అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ చంద్రశేఖర్,ఎస్పీఎఫ్ సిబ్బందికి అధికారులకు మీడియా మిత్రులందరికీ టీజీఎస్పీఎఫ్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీసీసీ ప్రెసిడెంట్ దేవి ప్రసన్న , మున్సిపల్ కమిషనర్ సుజాత , డిప్యూటీ మేయర్ లలిత కుమారి గారు అడిషనల్ కమాండెంట్ పి.కోటేశ్వరరావు,అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.చంద్రశేఖర్ ... పాల్వంచ పట్టణ కార్పొరేటర్లు మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి కిరణ్, మై బూబ్ పీరా, ఎస్ పి ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు

# సరదా క్షణం... శాశ్వత విషాదంగా మారింది

**– నీటి మడుగులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి సత్తుపల్లిలో విషాదం**
**– ఈత కొట్టేందుకు వెళ్లి మడుగులో మునిగిన ఇద్దరు బాలురు**
**– లోతు తెలియక ప్రమాదం ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు**
**– ఎంటీఆర్ నగర్‌లో విషాద ఛాయలు కుటుంబాల్లో ఆవేదన**

మేకార్తి దినపత్రిక



సత్తుపల్లి పట్టణంలోని ఎంటీఆర్ నగర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరదాగా బయటకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు సమీపంలోని నీటి మడుగులో మునిగి ప్రాణాలు కోల్పోయారు.మృతులు వంగూరి నాగబాబు (12), వంటిపులి దేవ (12)గా గుర్తించారు. వీరు ఆటపాటల కోసం బయటకు వెళ్లి, సమీపంలోని నీటి మడుగులో ఈత కొట్టేందుకు దిగారు. అయితే మడుగులో లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ మునిగిపోయారు.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే వారిని బయటకు తీయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఘటనతో ఎంటీఆర్ నగర్‌లో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సరదాగా గడపాల్సిన క్షణం శాశ్వత విషాదంగా మారడంతో గ్రామం మొత్తం శోకసంద్రంగా మారింది.

# కాశీ విశ్వనాధుడిని దర్శించుకున్న వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్

మేకార్తి దినపత్రిక

వారణాసి లోని కాశీ పుణ్యక్షేత్రంలో గంగా స్నానం చేసి హరహర మహాదేవుడు శంభో శంకరుడు అఖిలాండ కోటి బ్రహ్మాండ శక్తి స్వరూపుడైన కాశీ విశ్వనాధుడిని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి దర్శించుకున్నారు.అనంతరం గత సంవత్సరం మహా కుంభమేళ జరిగిన ప్రయాగ్ రాజ్ ను కూడా దర్శించుకుని గంగా స్నానం చేయడం జరిగిందని తెలిపారు.అనంతరం డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ... ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి లో ఉన్న శంభో శంకరుడైన శివ కాశీలో ఉన్న విశ్వనాధుడిని దర్శించుకోవడం అదేవిధంగా స్పర్శ దర్శనం చేసుకొవడం ఈ జన్మకు అదృష్టంగా భావిస్తున్నానని సంతోషం వ్యక్తం చేశారు.కాశీలో నలు దిక్కులు ఎటూ చూసినా శివ నామ స్మరణ తో శంభో శివ శంభో ద్వనులతో మారుమోగడం చెవులకు వినడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.కాశీలో ఉన్న కాశీ విశ్వనాధుడితో పాటు కేదారేశ్వర,




అన్నపూర్ణదేవి,కుబేర,కాలభైరవ, మృత్యుంజయ,విఘ్నేశ్వర, గువ్వలమ్మ,దుర్గామాత,శ్రీకృష్ణ, ఆంజనేయస్వామి లను దర్శించుకోవడం జరిగిందని అన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6గంటల నుండి 7గంటల సమయంలో కాశీ విశ్వనాధుడికి వేల మంది భక్తుల మధ్య మహా హారతి పూజ జరుగుతుందని హారతి జరుగుతున్న సమయంలో శంభో శంకర హర హర మహాదేవ శంభో శంకర అనే ధ్వనులతో క్రిక్కిరిసి పోవడం ఆ మహా హారతి కార్యక్రమం చూస్తున్న సమయంలో మనం ఎక్కడ ఉన్నామన్నది మరిచి పోయి శివనామ స్మరణలో మునిగి పోవడం మహా అనుభూతిని ఇస్తుందన్నారు. అంతే కాకుండా సత్యహరిశ్చంద్ర ఘాట్,మణికర్ణిక ఘాట్ లలో మరణించిన మానవ శవాల దహనాలు చూస్తుంటే నా మనసు చాలా కలత చెందిందని అన్నారు. ఈ సృష్టి లో మానవుడు భూమి మీద జన్మించినప్పుడు తీసుకు వచ్చింది ఏమీ లేదని అలాగే మరణించినప్పుడు తీసుకుని వెళ్లేది ఏమీ లేదని అంతా శూన్యం తప్ప వేరే ఏమీ లేదని ఇది అంతా అంతా మాయా ప్రపంచం అని బాధ వ్యక్తం చేశారు. ఈ కాశీ దర్శన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బండి గారి రాజు గౌడ్, గూడూరు భాస్కర్, కొత్త నర్సింహ స్వామి, మారపాక రమేష్ ముదిరాజ్ లు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు - ఎస్సై 2 నారాయణ హెచ్చరిక

మేకార్తి దినపత్రిక



?ఝరాసంగం మండల కేంద్రం లో రహదారి భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, ఝరాసంగం మండల పరిధిలోని స్థానిక ఎస్సై 2 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చర్యలు తీసుకున్నారు.? ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు.?డ్రంక్ అండ్ డ్రైవ్: మద్యం సేవించి వాహనం నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించారు.?ఈ సందర్భంగా ఎస్సై 2 వాహనదారులకు మరియు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. మైనర్లకు (చిన్నపిల్లలకు) వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అలా జరిగితే వాహన యజమానులైన తల్లిదండ్రులపైనే కఠినమైన కేసులు నమోదు చేస్తామని అవగాహన కల్పించారు.?ఈ కార్యక్రమంలో ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది నారాయణ, సందీప్, మారుతీ, శ్రీశైలం, మరియు ఎండి. యూనస్ పాల్గొన్నారు. ?"ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలి. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడపవద్దు విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లు నూతన గృహప్రవేశ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి

మేకార్తి దినపత్రిక

అందోల్ నియోజకవర్గం అల్లదుర్గ్ మండల పరిధిలోని అప్పాజీ పల్లి గ్రామంలో శుక్కురి సుకన్య బుమేష్ గారి ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి గారు,వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవనీయులు రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రభుత్వం, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నేది గౌరవనీయులు దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో "ఇందిరమ్మ ఇళ్లు" పథకాన్ని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది- ఇందిరమ్మ రాజ్య పాలన ప్రియమైన తెలంగాణ సోదర సోదరీమణులకు,అందరికీ ఆత్మగౌరవంతో కూడిన నివాసం ఉండాలన్నదే మన ప్రభుత్వ సంకల్పం. గతంలో ఇందిరా గాంధీ గారు పేదల కోసం ఇళ్లు నిర్మించిన స్ఫూర్తితో, నేడు మన రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే అవకాశాన్ని



కల్పిస్తున్నాం సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున ?5 లక్షల ఆర్థిక సాయం అందించబడుతుంది అని శేషారెడ్డి గారు కొనిఅడారు సినియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాష్ రావు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానబి కార్యదర్శి బాలకిషన్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అంజ గౌడ్, మజిసర్పంచ్ శ్రీనివాస్, కొంక శ్రీశైలం,బాలరాజు, సాయిలు, బ్రమయ్య, నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు

# డ్రైవర్ నిర్లక్ష్యం బైకును ఢీకొన్న కారు

**– వాహనదారునికి తీవ్రంగా గాయాలు**

మేకార్తి దినపత్రిక

పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన బత్తుల కృష్ణ వారి భార్య వరలక్ష్మి ఇద్దరూ బైక్ నెంబర్ ఋా 06 జుజ 8724 పెబ్బేరు నుంచి కల్వరాల గ్రామానికి పుట్టచిర ఫంక్షన్ కు వెళుతుండగా కిష్టారెడ్డిపేట ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ముందల స్విఫ్ట్ డిజైర్ కారు నంబర్ ఋా 06 ఖీజ 1728 అతివేగంతో బైక్ను ఢీకొట్టడం వల్ల వాహనదారునికి తలకు కాలుకు బలమైన గాయాలు కావడంతో అంబులెన్స్ సహాయంతో వనపర్తికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు డాక్టర్ల సూచన మేరకు కర్నూల్ హాస్పిటల్ కు తరలించి ప్రస్తుతం అమీలియా హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు

PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com